# దేవుని వాక్యమును అన్వయించడములో ప్రాథమిక విషయాలు: 4 నిర్ణయాలు మరియు 4 విశిష్టతలు

వాక్యాన్ని అనుసరిస్తున్నామని చెప్పుకునే మతనాయకులు తమ విశ్వాసాలు, ఆచారాలలో ఒకరినుండి ఒకరు భిన్నంగా ఉండడం ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఎందుకు యిలా? ఒక సమాధానం కనబడుతుంది: వారు అదే వాక్యాన్ని విభిన్నంగా ఉపయోగిస్తున్నారు. ఒకరు వాక్యాన్ని సరిగా అర్థం చేసుకోవడంలేదు, అన్వయించడం లేదు – కాబట్టి వాక్యాన్ని సరియైన విధంగా అధ్యయనం చేయడం, అన్వయించడం ఎంతో అవసరం.

బైబిలును సరిగా ఉపయోగించవలిసినన అవసరత 2 తిమోతి 2:15లో చెప్పబడింది: "దేవునియెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము." (KJV)లో "జాగ్రత్తపడుము" అను పదమునకు "study" అను పదం వాడబడింది. ఇది అనేకమందికి తప్పుడు సంకేతాన్నిస్తుంది. ఈ పదం యొక్క గ్రీకు పదానికి "జాగ్రత్త కలిగియుండడం" అని అర్థం. ఇది 2 పేతురు 1:10 మరియు 2 పేతురు 3:14లో వాడబడింది. 2 తిమోతి 2:15లో ఈ పదం బైబిలును వాడడం విషయంలో చెప్పబడింది. కాబట్టి, ఇది వాక్యాన్ని చదువవలసిన ఆవశ్యకతను చెప్తుంది.

"సత్య వాక్యమును" "సరిగా ఉపదేశించుట" అనగానేమి? "సరిగా ఉపదేశించుటను" KJVలో "rightly dividing" అను పదం చెప్పబడింది. ఈ పదానికి "తిన్నగా చూపడం" అని అర్థం. ఈ నిర్దిష్ట వాక్యభాగమును సువార్త బోధకులనుద్దేశించి పౌలు వ్రాశాడని వ్యాఖ్యానకర్తలు చెప్తున్నారు. మనం లేఖనములను సరిగా బోధించాలి. సత్య వాక్యంనుండి తొలగిపోకుండా, శ్రోతల అవసరతలకు మరియు పరిస్థితులకు అనుగుణంగా బోధించాలి. "స్పష్టంగా, తప్పులు లేకుండా త్రోసివేయలేని విధంగా (కాదనకుండునట్లు) సత్యంగా సువార్తను అందించడం ఇక్కడ ఉద్దేశం" అని B. W. Johnson చెప్తున్నాడు.[1]

వాక్యాన్ని "తిన్నగా చూపడమంటే" వాక్యాన్ని చదివి, అందులోని సత్యాన్ని ప్రజలకు అన్వయించేందుకు సరియైన రీతిని చూపడం. ఇందులో భాగంగా నాలుగు నిర్ణయాలు, మరియు నాలుగు విశిష్టతలను చూద్దాం.

---

### నిర్ణయం 1: ప్రజల మాటల కంటే దేవుని మాటనే అంగీకరించడం

1 థెస్సలొనీకయులకు 2:13లో పౌలు "దేవుని వాక్యం" మరియు "మనుష్యుల వాక్యం" గురించి ప్రస్తావిస్తున్నాడు:

> ఆ హేతువుచేతను, మీరు దేవునిగూర్చిన వర్తమాన వాక్యము మావలన అంగీకరించినప్పుడు, మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా ఉన్నట్లు దేవుని వాక్యమని దానిని అంగీకరించితిరి గనుక మేమును మానక దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఆ

వాక్యమే విశ్వాసులైన మీలో కార్య సిద్ధి కలుగజేయుచున్నది.

మనుష్యులు అనేక గ్రంథాలను వ్రాశారు. అందులో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి. కొన్ని సత్యమైనవి, కొన్ని సత్యదూరమైనవి. మత సంబంధ విషయాలు వ్రాయడం తప్పు కాదు. క్రైస్తవులు వ్రాసినవాటిని బట్టి అనేకమంది ప్రోత్సహించబడి, సరిదిద్దబడి, మార్పు చెందుతున్నారు. ఇతరులు వ్రాసిన వాటిని చదవడం తప్పుకాదు; అవి ఆత్మీయతకు సహాయపడవచ్చు. అయితే మనుష్యులు చెప్తున్నవి దేవుని వాక్యమునకు సమానమైనవి కావు. ప్రజలు చెప్పిన ప్రతిదీ వాక్యంచేత విమర్శింపబడాలి.

బైబిలు వంటిది ఏదియూలేదు. అది మాత్రమే "దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2 తిమోతి 3:16, 17). కాబట్టి మనం దేవుని వాక్యము చదువునప్పుడు, అది దేవుని మాటయని ఎరిగి ఎంతో గౌరవముతో చదవాలి. దాన్ని చదువునప్పుడు, మనం "పరిశుద్ధమైన ఆధారం పై" ఉన్నామన్న భావన మనలో ఉండాలి. దాని సందేశాన్ని మార్చివేయడం గాని, చులకన చేయడం గాని కూడదు, దాన్ని అన్వయించునప్పుడు, వాక్యం ఏం చెప్తుందన్నది ప్రాముఖ్యంగాని, దానినుండి మనం ఏ నిర్ధారణకు వచ్చామన్నది ముఖ్యం కాదు.

### నిర్ణయం 2: మన ఆశలకంటే వాక్యం చెప్తున్నదానినే జరిగించడం

లేఖనాలను అన్వయించునప్పుడు, మనం ఏం నమ్మాలని అనుకొంటున్నామో దానికంటే, వాక్యం ఏం బోధిస్తుందన్నదే ప్రాముఖ్యంగా ఎంచాలి. మనం ఏం వాక్యం వినాలని ఆశిస్తున్నామో, మనకు నచ్చే బోధనను ఎవరు అందిస్తున్నారో వారినే అనుసరించడం సహజ మానవ నైజం. దీనిని యిర్మీయా తన దినాల్లోనూ చూశాడు:

> ఘోరమైన భయంకరకార్యము దేశములో జరుగుచున్నది. ప్రవక్తలు అబద్ధ ప్రవచనములు పలికెదరు, యాజకులు వారి పక్షమున ఏలుబడి చేసెదరు, అలాగు జరుగుట నా ప్రజలకు ఇష్టము; దాని ఫలము నొందునప్పుడు మీరేమి చేయుదురు? (యిర్మీయా 5:30, 31).

దీని సంబంధిత విషయాన్నే పౌలు కూడా చెప్తున్నాడు:

> ఎందుకనగా జనులు హితబోధను సహింపక, దురద చెవులుగలవారై తమ స్వకీయ దురాశలకు అనుకూలమైన బోధకులను తమకొరకు పోగుచేసికొని సత్యమునకు చెవి ఇయ్యక కల్పనా కథలవైపునకు తిరుగు కాలము వచ్చును (2 తిమోతి 4:3, 4).

మనకు కొన్ని భావములు నమ్మడానికి ఇష్టముగా ఉంటాయి. బహుశ నిత్యశిక్ష అంటే నిర్మూలనం అని నమ్మడం మనకు ఇష్టం కావచ్చు. దుష్ట సంబంధులుగా ఎంచబడినవారు వారిక ఉండరని నమ్మవచ్చు. అయితే మన నమ్మకానికి విభిన్నంగా వాక్యం ఏదైనా చెప్తే దాన్ని మనం నమ్మాలి. ఎందుకు? ఎందుకంటే, దేవుని సత్యాలను నమ్మడం ఎంత కష్టమైనా, దాన్ని అన్నిటికంటే పైగా మనం అంగీకరించాల్సిందే! దేవుని సత్యమును అంగీకరించకపోవడం వలన కలిగే ప్రతిఫలం బహు భయంకరంగా ఉంటుంది. ధర్మవిరోధి గురించి మరియు సత్యమును ప్రేమింపని వారి గురించి పౌలు యిలా చెప్తున్నాడు:

> ... నశించుచున్నవారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపక పోయిరి గనుక, వాని రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానా విధములైన సూచక క్రియలతోను, మహత్కార్యములతోను దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్నవారిలో సాతాను కనుపరచు బలమును అనుసరించి యుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాషగల వారందరును శిక్షావిధి పొందుటకై, అబద్ధమును నమ్మునట్లు మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు (2 థెస్సలొనీకయులకు 2:9-12).

అబద్ధమును నమ్మడానికి కారణమయ్యే "మోసము చేయు శక్తిని" దేవుడు పంపించడం ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటుంది. అయితే ఈ "మోసము చేయు శక్తి" పంపబడేది కేవలం "సత్య విషయమైన ప్రేమను అవలంబింపని" వారి నిమిత్తమే! దేవుని ఆశీర్వాదములు పొందుకోవాలంటే, మనం సత్యవిషయమైన ప్రేమను కలిగియుండాలి.

వాక్యాన్ని మనకు అన్వయించుకొన్నప్పుడు, "ఈ సిద్ధాంతం సత్యమని నేను నమ్ముతున్నది, నేను నమ్ముతున్నందువలన లేక అది సత్యమైనందునా లేక దాన్ని వాక్యం బోధిస్తున్నందునా?" అని ప్రశ్నించుకోవాలి.

## నిర్ణయం 3: వాక్యాన్ని మామూలుగా కాకుండా ప్రత్యేక శ్రద్ధతో చదవడం

దేవుని చిత్తమును ఎరిగియుండాలన్న భావనతోనే గాక దేవుని సత్యమును అన్వేషించాలన్న ఆశతో మనం వాక్యాన్ని చదవాలి. "వెదకుడి మీకు దొరుకును" (మత్తయి 7:7) అని ప్రభువు చెప్పారు. ఆసక్తితో వెదకడం గురించి ఆయన ఇక్కడ చెప్పారు. అలాగే "నీతికొరకు ఆకలిదప్పులుగలవారు ధన్యులు వారు తృప్తిపరచబడుదురు" (మత్తయి 5:6) అని కూడా చెప్పారు; ఇక్కడ ఆయన చెప్తున్నది ఆకలిదప్పుల తీవ్ర స్థితిని బట్టి కలిగిన ప్రయాసను గురించి చెప్తున్నారు.

మనం వాక్యాన్ని చదువుతున్నప్పుడు, ఎందుకు మనం కొన్నిసార్లు నేర్చుకోము! సాధారణంగా మనం నేర్చుకునేందుకు కష్టపడే ప్రయత్నం చేయము. అనేకమంది రక్షణా సత్యమునకు రారు ఎందుకంటే, దాని గురించి వారు అక్కర చూపరు. వారికి ఏదైనా ఒక ప్రశ్న ఎదురైతే అది బైబిలునుండే అయినా దానికి సమాధానం ఇయ్యలేరు. "అది నీ వ్యాఖ్యానం" లేదా "నేనది ఒప్పుకోను" అని దాటివేస్తుంటారు. జీవ - మరణ సమస్యలోనున్న ఒకరు యిలా ప్రతిస్పందించడం మీరు ఊహించగలరా?

వాక్యములోని సరళ బోధనను వ్యతిరేకిస్తున్నవారు ఒక గ్రామ పెద్దలాంటి వారు. ఆ గ్రామములో సంక్షేమాన్ని కాంక్షిస్తు త్రాగు నీరు నిమిత్తము మరో సదుపాయన్ని చేసేందుకు ఆరోగ్య కార్యకర్తలు అతన్ని కలిసారు. సమస్యను అతనికి వివరించేందుకు గ్రామ బావిలోని నీటి బొట్టును తీసి దాన్ని మైక్రొస్కోపులో చూపించారు. మైక్రొస్కోపుగుండా ఆ నీటిని చూసినప్పుడు అందులో వేలకొలది హానికర క్రిములు కనిపించాయతనికి. "దీని విషయమై ఏమి చేస్తారు?" అని అతనిని వారు ప్రశ్నించారు. అందుకతడు "మైక్రొస్కోపును నాశనం చేయండి!" అని అన్నాడు.

దేవుని వాక్యమును అర్థం చేసుకొనుటకు దాన్ని అన్వయించుకొనుటకు మనకు ఏం

కావాలి? 2 తిమోతి 2:15లో చెప్పబడిన శ్రద్ధ కావాలి. దేవుడు తన వాక్యం ద్వారా ఈ రోజున మనం ఏం చేయాలని కోరుకుంటున్నాడోనన్న విషయాన్ని ఆయన వాక్యం ద్వారా గ్రహించేందుకు ఆ శ్రద్ధ మనలను ఎంతో ప్రోత్సహించును.

### నిర్ణయం 4: మనుష్యుల బోధనల కంటే దేవుని బోధను అంగీకరించడం

మనుష్యుల బోధన కంటే దేవుని వాక్యమునకు యేసు ప్రభువు ప్రాధాన్యతను ఇచ్చారు. మత్తయి 15:1-9లో యేసు శిష్యులు భోజనమునకు ముందు చేతులు కడుగుకొనకుండా పెద్దల పారంపర్యాచారమును అతిక్రమించారని పరిసయ్యులు ఆరోపించారు. ఇందుకు యేసు బదులిస్తూ, వారి ఆచారమునుబట్టి వారు దేవుని ఆజ్ఞను మీరారని ఆరోపించాడు. ప్రత్యేకించి తల్లిదండ్రులను గౌరవించాలని దేవుడు ఆజ్ఞ ఇయ్యగా; వారి సంప్రదాయం ప్రకారం, దేవునికి ఇవ్వడం ద్వారా తల్లిదండ్రులకు అని చెప్పుచున్నారు. యేసు యిలా అన్నాడు,

> మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయుచున్నారు. వేషధారులారా - ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు అని వారితో చెప్పాడు (మత్తయి 15:6-9 వచనాలు).

మనుష్యులు కల్పించిన "పద్ధతులు" దేవుని ఆజ్ఞలను "మీరే" విధంగా ఉండకూడదు.

దేవుని వాక్యాన్ని గైకొనునప్పుడు మనం ఎందుకు జాగ్రత్తగా ఉండాలి? ఎందుకంటే క్రొత్త నిబంధన కాలంలో నున్నట్లే అబద్ధ బోధకులు ఈ కాలంలోనూ ఉన్నారు. "అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తపడండి, వారు గొఱ్ఱెల చర్మములు వేసికొని మీ యొద్దకు వత్తురు కాని లోపల వారు క్రూరమైన తోడేళ్ళు" (మత్తయి 7:15) అని యేసు అన్నారు. అబద్ధ బోధకులు ఇప్పటికే తమ బోధనల ద్వారా దేవుని వాక్యమును నిరర్థకము చేస్తున్నారు (మత్తయి 15:6; RSV).

అబద్ధ ప్రవక్తలని, బోధకులని మనం ఎలా చెప్తాము? గొఱ్ఱెల చర్మాలు వేసుకున్న తోడేళ్ళువారు గనుక బయట రూపం ద్వారా వారిని కనిపెట్టలేము. అలా గాక వారి బోధనలను దేవుని వాక్యంతో సరిచూడడం ద్వారా వీరిని కనిపెట్టవచ్చు. ప్రజలు ఏం చెప్తున్నారు, ఏం చేస్తున్నారు అన్న విషయమై మనం బెరయ ప్రజలవలె ఉండాలి. ఇతరులు "చెప్పిన సంగతులు అలాగున్నవో లేవో అని ప్రతి దినము లేఖనములను పరిశోధించుచుండాలి" (అపొస్తలుల కార్యములు 17:11). దేవుని ఆవశ్యకతలను పక్కనపెట్టే ప్రతి బోధనను మనం అనుసరింపక త్రోసివేయాలి.

---

### విశిష్టత 1: దేవుని వాక్యం గురించి మనం ఏం తెలుసుకోగలం మరియు ఏం తెలుసుకోలేం అన్న వాటి మధ్యగల తేడా

దేవుని వాక్యాన్ని మన జీవితాలకు అన్వయిస్తున్నప్పుడు, దేవుని వాక్యం గురించి మనం ఏం తెలుసుకోగలం మరియు దేవుని వాక్యం బయలుపరచనిది ఏదనగా, "బయలుపరచబడిన విషయాలు" మరియు "రహస్య విషయాల" మధ్య తేడాను గుర్తించాలి. మనం వాక్యంనుండి (బైబిలు) కొన్ని విషయాలను తేటగా గ్రహించగలము. "మీరు సత్యమును గ్రహించెదరు, సత్యము మిమ్ములను స్వతంత్రులునుగా చేయును" అని యోహాను 8:32 చెప్తుంది. అయితే, దేవుడు

కొన్ని విషయాలను తన వరకు మాత్రమే యుంచుకొని, వాటిని మనకు మరుగు పరిచాడు మరియు కొన్ని "రహస్యములు" దేవునికే చెందును (ద్వితీయోపదేశకాండము 29:29). ఉదాహరణకు దేవుడు ఎక్కడినుండి వచ్చాడన్న విషయాన్ని (ఆయన నిత్యమూ ఉన్నవాడని చెప్తున్న విషయం) తెల్పింది. కయీను తన భార్యను ఎలా పొందాడన్న విషయాన్ని, లేదా యేసునకు తన దైవత్వం ఎప్పుడు తెలిసింది అన్న విషయాలను వాక్యం బయలుపరచలేదు. ఈ విషయాలను పరిశోధిస్తు మన సమయం, శక్తిని దీనిమీద వృథాచేసుకుంటామా? "వినువారిని చెరుపుటకే గాని మరి దేనికిని పనికిరాని మాటలను గూర్చి వాదము పెట్టుకొనవద్దని" మరియు "అపవిత్రమైన వట్టి మాటలకు విముఖుడవైయుండుమని అట్టి మాటలాడువారు మరి ఎక్కువగా భక్తిహీనులగుదురని" పౌలు క్రైస్తవులను హెచ్చరిస్తున్నారు (2 తిమోతికి 2:14–16). మనకు బయలుపరచని విషయాలను "అపవిత్రమైన మాటలు" లేదా "పనికిరాని మాటలు"గా చెప్పబడ్డాయి. వాటిని మనం ప్రక్కన పెట్టాలి.

బైబిలు అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వదని మనం గుర్తుంచుకోవాలి. మనం వాక్యం చెప్తున్న విషయాలను గురించి అధ్యయనం చేస్తున్నప్పుడు, వాక్యం ఏది తేటగా చెప్తుందో దాని విషయమై సంతృప్తిపడాలి గాని, అది తెలియపర్చనివాటి విషయంలో ఆందోళన పడకూడదు. వాక్యం స్పష్టపరచే వాటి విషయంలో మనం దృష్టియుంచాలి.

### విశిష్టత 2: ఏది అర్థం చేసుకోవడానికి సులభంగా ఉంటుందో, ఏది కష్టతరంగా ఉంటుందో వాటి మధ్య తేడాను గ్రహించడం

లేఖనాలలో అర్థంచేసుకోవడానికి ఏది సులభంగా, ఏది కష్టంగా ఉంటుందో అనగా లేఖనాలలోని "బలమైన ఆహారం" మరియు "పాలు" మధ్య భేదాన్ని అర్థం గుర్తించగలగాలి. ఈ భేదాన్ని క్రొత్త నిబంధన గ్రంథకర్తలు చెప్పారు. హెబ్రీయులకు 5:12–14 యిలా చెప్తుంది,

> కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా నుండవలసినవారైయుండగా దేవోక్తులలో మొదటి మూల పాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసివచ్చెను. మీరు పాలు త్రాగవలసినవారే గాని బలమైన ఆహారము తినగలవారుకారు. మరియు పాలు త్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతి వాక్యవిషయములో అనుభవములేని వాడైయున్నాడు. వయస్సు వచ్చినవారు, అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు. గనుక బలమైన ఆహారము వారికే తగును.

1 కొరింథీయులకు 3లో, కొంతమంది సహోదరులను పౌలు "శరీర సంబంధులు" మరియు "క్రీస్తునందు పసిబిడ్డలు" అని చెప్తున్నాడు. అంతేకాక "అప్పటిలో మీకు బలము చాలకపోయినందున పాలతోనే మిమ్మును పెంచితిని గాని అన్నముతో మిమ్మును పెంచలేదు" (2 వచనం) అంటున్నాడు.

అలాగే 2 పేతురు 3:15, 16లో యిలా చూస్తున్నాము,

> మరియు మన ప్రభువుయొక్క దీర్ఘశాంతము రక్షణార్థమైనదని యెంచుకొనుడి. ఆలాగు మన ప్రియ సహోదరుడైన పౌలుకూడ తనకు అనుగ్రహింపబడిన జ్ఞానము చొప్పున మీకు వ్రాసి యున్నాడు. వీటినిగూర్చి తన పత్రికలన్నిటిలోను బోధించుచున్నాడు. అయితే వాటిలో కొన్ని

సంగతులు గ్రహించుటకు కష్టమైనవి, వీటిని విద్యావిహీనులును; అస్థిరులైనవారును తక్కిన లేఖనములను అపార్థముచేసినట్లు. తమ స్వకీయ నాశనమునకు అపార్థముచేయుదురు.

ఈ వాక్య భాగంలో ఏ ప్రాముఖ్య విషయాలు కనబడుతున్నాయి? (1) పౌలు తన లేఖనాలలో పేతురుతో అంగీకరిస్తున్నాడు. నిజానికి వీరిద్దరూ "ప్రియ సహోదరులు." పౌలు, పేతురుల మధ్య సిద్ధాంతిక విభేదాలు ఏమీలేదు. (2) పౌలు లిఖితాలు, లేఖనాలు అవి దైవావేశితమైనవి. (3) పౌలు వ్రాసినవాటిలో కొన్ని గ్రహించుటకు కష్టతరమైనవి. అయితే, "కొన్ని విషయాలు" కష్టం అంటే ఎన్నో విషయాలు గ్రహించుటకు సులభతరమైనవి. పౌలు వ్రాసినవి మరియు లేఖనాల్లో గ్రహింప అసాధ్యముగా నుండుటకు ఉద్దేశించినవి కావు. (4) గ్రహించుటకు కష్టంగా ఉండే విషయాలు నాశనమునకు నడిపించవు. విద్యావిహీనులు, అస్తిరులైనవారికి అవి అపార్థముగా ఉంటాయి. (5) అసాధ్య లేఖనాలవలన నాశనం విద్యావిహీనులకు, అస్థిరులైనవారికి కలుగుతుంది. ఎందుకంటే వారు కష్టమైన లేఖనములను ("వక్రించి"; KJV; "మెలికించి మరియు దురన్వయంచేసుకొని" AB) మార్చుతుంటారు.

ఈ వాక్య భాగములను బట్టి బైబిలులోని కొన్ని వాక్య భాగములు గ్రహించుటకు కష్టంగా ఉన్నా, ఎక్కువ వాక్యభాగాలు గ్రహింప సుళువుగానే ఉంటాయి. వాక్యం మనకు ఏం చెప్తుందో చూచునప్పుడు ఏ వాక్య భాగాలయితే దేవుని చిత్తాన్ని మనకు మనస్ఫూర్తిగా తెలియజేస్తాయో వాటికి మనం ప్రాధాన్యత నివ్వాలి.

గ్రహింప కష్టతరంగానున్న వాక్య భాగాలతో (ఉదాహరణకు, ప్రకటన గ్రంథం) ప్రారంభించడం కంటే, గ్రహింప సుళువుగానుండే వాక్య భాగాలతో ఆరంభించడం మేలు. వాక్యాన్ని మన జీవితాలకు అన్వయించే ప్రయత్నం చేయునప్పుడు, స్పష్టంగా నుండే లేఖనాలను అర్థంచేసుకుని వాటికి లోబడాలి. Mark Twain యిలా అంటున్నాడు, "బైబిల్లోని ఏ వాక్యం నాకు అర్థంకాలేదో నేను వాటి నిమిత్తం ఆందోళనపడనుగాని నాకు అర్థమయ్యే వాటినే నేను గ్రహిస్తాను."[2] "నాకు అర్థమైన వాక్యానికి నేను లోబడుతున్నానా?" అని మనమందరం ప్రశ్నించుకోవాలి.

## విశిష్టత 3: క్రొత్త మరియు పాత నిబంధనల మధ్య భేదము

పాత మరియు క్రొత్త నిబంధనలలోని నిబంధనముల మధ్యనున్న తేడాను బైబిలు అందిస్తుంది. హెబ్రీయులకు 8:13 (యిర్మీయా 31లో చెప్పబడిన క్రొత్త నిబంధనను ఉదహరించునది) రెండు నిబంధనల గురించి మొదటి మరియు క్రొత్త నిబంధన గురించి చెప్తుంది: "ఆయన క్రొత్త నిబంధన అని చెప్పుటచేత మొదటిది పాతదిగా చేసియున్నాడు. ఏది పాతగిల్లి ఉడిగిపోవునో అది అదృశ్యమగుటకు సిద్ధముగా ఉన్నది." బైబిలు రెండు నిబంధనల మధ్యనున్న తేడాను చెప్తుంది. కాబట్టి మనమూ దాన్ని గుర్తించాలి.

అంతేగాక, క్రీస్తు ధర్మశాస్త్రమును ముగించాడని క్రొత్త నిబంధన బోధిస్తుంది (చూడండి గలతీయులకు 3:24, 25; ఎఫెసీయులకు 2:15). దాని ఫలితంగా మనం పాత నిబంధన విధులకు లోబడియుండలేదు. పాత నిబంధన మన అధ్యయనం నిమిత్తం యుక్తంగా ఉంటుంది కానీ, మనం అందులోని విధులు, నియమాలను అనుసరించాల్సిన పనిలేదు.

"బైబిలు యిలా చెప్తుంది" అని మనం చెప్ప వీలుకాదు గాని, ఏది బైబిల్లో ఎక్కడ

చెప్ప బడిందో చూడాలి. పాత నిబంధనలో ఇయ్యబడిన ప్రతిపాదనలు మనకు అవసరం కాకపోవచ్చు. అలాగే పాత నిబంధనలో ఇయ్యబడిన విధులు, ఆజ్ఞలు మన నిమిత్తం కావు. బైబిలు మొత్తం ప్రాముఖ్యమే అయినా, అందులోని భాగమైన క్రొత్త నిబంధన ఈనాటి ప్రజలకు అన్వయించబడుతుంది. ఇప్పుడు మనం దేవున్ని ఎలా సంతోషపరచాలి, ఎలా జీవించాలి అన్న విషయమై మనం పాత నిబంధనను గాక క్రొత్త నిబంధనను చూడాలి.

## విశిష్టత 4: వాక్యంలో ఏది మనలను ఆజ్ఞాపిస్తుంది ఏది మనలను ఆజ్ఞాపించడంలేదు అన్న వాటి మధ్యగల భేదము

తన ప్రజలకు ఏది అవసరము మరియు ఏది అవసరం లేదు అన్న వాటి మధ్యగల తేడాను యేసు గుర్తించారు. ఆయన పేతురుతో మాట్లాడుతూ మత్తయి 16:19లో “బంధించడం,” “విప్పడం” గురించి చెప్పారు – “పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను. నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును. భూలోకమందు దేని నీవు విప్పుదువో అది పరలోకమందును, విప్పబడునని” అతనితో చెప్పెను. ఈ వాక్యభాగంలో “బంధించడం” అనేది దేవుడు ఆజ్ఞాపిస్తున్నది కోరుతున్నది. అలాగే “విప్పడం” అనేది దేవుడు ఆశించనిది.

క్రొత్త నిబంధన కాలంలో కొంతమంది క్రైస్తవులు దేవుడు “బంధించిన” దానిని “విప్పడం” చేశారు. ఉదాహరణకు, క్రైస్తవులు సమాజముగా కూడుకొనవలెనని దేవుడు ఆశించాడు, కానీ కొంతమంది ఈ విషయంలో విఫలమయ్యారు (హెబ్రీయులకు 10:25). కొంతమంది దేవుడు “విప్పిన” దానిని బంధించేందుకు ప్రయత్నిస్తున్నారు. వివరంగా చెప్పాలంటే, అన్యులు రక్షించబడాలంటే వారు సున్నతిని ఆచరించవలసిందేనని కొంతమంది యూదులు బోధించారు. దేవుడు ఆశించని విధిని వారు బంధకము లేదా ఆజ్ఞగా పాటించారు.

అదేవిధంగా, మనము కొన్నిసార్లు దేవుడు ఆశించిన దానిని వదిలేస్తాము. దేవుడు ఆశించనిదానిని ఆజ్ఞగా పాటిస్తాం. మత్తయి 25:18–20లోని మహా ఆజ్ఞ కొన్ని విషయాలను బంధిస్తుంది: “మనం వెళ్ళాలి, శిష్యులను చేయాలి, బాప్తిస్మమియ్యాలి, అలాగే వారికి బోధనందించాలి” ఇది కొన్ని విషయాలనూ విప్పుతుంది. మనం ఎలా వెళ్ళాలన్న విషయమై నిబంధనలేదు. అలాగే బోధించేందుకు ఏ పద్ధతులు ఉపయోగించాలన్న దానిపై నియామాలు లేవు. ఒకవేళ ఎవరన్నా బస్సుకే వెళ్ళాలని క్రొత్త నిబంధన విధిస్తే అది దేవుడు విప్పినవాటిని ఆజ్ఞగా మార్చడం అవుతుంది.

ఈ మాటను మరోవిధంగా చెప్పాలంటే, మనం ఆవశ్యక మరియు యుక్తముల మధ్యగల భేదాన్ని గుర్తించాలి. మహా ఆజ్ఞలోని ఆవశ్యకతలు ఏమంటే, వెళ్ళడం, బాప్తిస్మమియ్యడం, బోధించడం, వీటి విషయంలో మనకు మరో ప్రత్యామ్నాయం లేదు. క్రీస్తు ఆజ్ఞాపించినది మనం చేయాల్సిందే! అయితే, మనం ఎలా వెళ్ళాలి – విమానం, ఓడ, రైలు, కారు, సైకిలు మరియు ఎలా బోధించాలి – వ్యక్తిగతంగా, బహిరంగంగా, రేడియో, టీవీల ద్వారా, కరపత్రాలద్వారా అన్నవన్నియూ యుక్తతలోకి వస్తాయి. దేవుడు ఆదేశించిన దానిని చేయుటకు మనకు ఆవశ్యక, యుక్త విధానాలు రెండు ఉన్నాయి.

క్రొత్త నిబంధనలోని మతాచారములను మనం ఈనాటి సంఘానికి అన్వయించే విషయానికి వస్తే, ముందుగా ఆవశ్యకత మరియు యుక్తతల మధ్యగల వ్యత్యాసాన్ని

గుర్తించాలి. దీనిని చేయడం కొన్నిసార్లు కష్టమే అయినా దీన్ని చేయుటకు మొదటి అడుగు ఏమంటే, దేవుడు బంధించినవాటిని మనం బంధిస్తున్నామని, దేవుడు విప్పిన వాటిని మనం విప్పుతున్నామని ఎరిగియుండడం.

## ముగింపు

దేవుని వాక్యాన్ని మనకు ఎలా అన్వయించాలన్న విషయమై ఎంతో చెప్పవచ్చు. అయితే, ఈ నాలుగు నిర్ణయాలు, నాలుగు భేదములను మనం అర్థం చేసుకుంటే, దేవుని వాక్యం మనతో ఏంచెప్తుందో మనం గ్రహించగలము.

- బైబిలు దైవావేశిత దేవుని వాక్యమని మనం గుర్తించాలి.
- మనం నమ్ముతున్న విషయాలు వాక్యంతో విభేదిస్తున్నట్లయితే వాటిని ప్రక్కనపెట్టాలి.
- వాక్యాన్ని శ్రద్ధగా చదవాలి.
- మన బోధనను వాక్యంతో సరిచూసుకుని, లేఖనమునకు విరుద్ధమైనవాటిని వదిలివేయాలి.
- మనకున్న ప్రతి ప్రశ్నకు సమాధానం వాక్యంలోవుంటుందని మనం భావించకూడదు.
- మనకు స్పష్టముగా సులభముగా అర్థమయ్యే సత్యాలతో మనం అధ్యయనం ప్రారంభించాలి.
- ఈనాటి ప్రజలకు అన్వయింపదగిన లేఖన భాగంగా క్రొత్త నిబంధనను మనం గుర్తించాలి.
- క్రొత్త నిబంధనలో ఆవశ్యకముగానున్న విషయం మరియు యుక్త విషయాల మధ్య అనగా విశ్వాసం మరియు అవిశ్వాస విషయాల మధ్యగల భేదాన్ని గుర్తించాలి.

వాక్యం మనకు ఎలా అన్వయించబడుతుందో తెలుసుకున్న తరువాత, అది ఆశిస్తున్న దానిని మనం చేస్తే దానినుండి మనం లబ్దిపొందగలము.

---

సూచనలు

[1]B. W. Johnson, *The People's New Testament with Notes,* vol. 2, *The Epistles and Revelation* (Delight, Ark.: Gospel Light Publishing Co., n.d.), 278-79. [2]Laurence J. Peter, *Peter's Quotations: Ideas for Our Time* (New York: Quill, William Morrow, 1977), 70.